క్లుప్తంగా

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



గురజాల: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని పిడుగురాళ్ల సీడీపీఓ శ్రీవల్లి తెలిపారు. స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో మంగళవారం బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యదశలో వివాహాలు చేయడం మంచిది కాదన్నారు. చిన్న వయస్సులో వివాహాలు చేయడం వలన ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవల్సి వస్తుందన్నారు. అదే విధంగా చిన్నారులను పనుల్లో పెట్టుకోవడం కూడా నేరమన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే గ్రామస్థాయి అధికారులకు గానీ మండల స్థాయి అధికారులకు గానీ సమాచారం ఇవ్వాలన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ రుక్సానా సుల్తానా బేగం, సారియా రాజు, న్యాయవాది శ్రీలత, ప్రశాంత్, కౌన్సిలర్ శ్రీనివాసరావు, మాచర్ల సీడీపీఓ సరళ, సూపర్‌వైజర్ వై.రత్నకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు, తదితరులున్నారు.

భక్తిశ్రద్ధలతో పునీత జోజప్ప మహోత్సవం

పెదకూరపాడు: జలాల్‌పురం గ్రామంలో మంగళవారం పునీత జొజప్ప దేవాలయ పండగ మహోత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పాటిబండ్ల విచారణ గురువులు రెవరెండ్ హృదయకుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక దివ్య పూజ బలిని నిర్వహించారు. హృదయకుమార్ ఆధ్యాత్మిక చింతనలో ప్రతి ఒక్కరూ నడవాలని కోరారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తనయుడు కల్యాణ చక్రవర్తి మహోత్సవంలో పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



బొల్లవరం(ముప్పాళ్ళ): సత్తెనపల్లి రూరల్ సీఐ రాంబాబు బొల్లవరం అడ్డరోడ్డు వద్ద హోం గార్డు సుభాని ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ సుభాని సేవలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సుభానిని అభినందించారు. ముప్పాళ్ళ ఎస్సై హజరతయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూల్స్‌లో ఉచిత ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నకరికల్లు: ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారులు వి.ఏసుబాబు, ఎన్.ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాహక్కు చట్ట ప్రకారం 25 శాతం సీట్లు ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఉచితంగా కేటాయించాల్సి ఉందన్నారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, అనాథలు, విభిన్న ప్రతిభావంతులు, హెచ్ఐవీ బాధిత పిల్లలు ఉచిత సీట్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈనెల 25వతేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు ఎంఈఓ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

శిశుమందిర్‌కు కంప్యూటర్ల వితరణ



సత్తెనపల్లి: పట్టణంలోని సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలకు రూ. 55 వేల విలువైన కంప్యూటర్లను స్థానిక వస్త్ర వ్యాపారి అన్నం వెంకటరమణ, రాజేశ్వరి దంపతుల రెండవ కుమార్తె కుమారి లక్ష్మి గాయత్రి మంగళవారం బహూకరించారు. కంప్యూటర్లను అన్నం దంపతులు ప్రారంభించారు. వారిని పాఠశాల కార్యదర్శి చలువాది చిన్న సత్యనారాయణ సత్కరించారు. పాఠశాల ప్రధాన మాతాజీ మన్నవ ధనలక్ష్మి, విద్యాభారతి ప్రాంత కార్యదర్శి జేపీఎస్ శాస్త్రి, పాఠశాల సమితి సభ్యులు దేవరశెట్టి రవికుమార్ పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం

సత్తెనపల్లి: పట్టణంలోని సంఘం బజారులో ఆంజనేయ స్వామి ఆలయ 17వ వార్షికోత్సవాలు మంగళవారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం పఠించారు. 108 కదళీ ఫలములతో అర్చన చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రులయ్యారు.

రాజ్యపాలకులు శాలివాహనులు

- ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి
- గురజాలలో శాలివాహనుల ఆత్మీయ సమ్మేళనం
- టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన కోనంకి తండా వాసులు



ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన శాలివాహనులు

పిడుగురాళ్ల: రాజ్యాలను ఏలి, పాలించిన వారు శాలివాహనులని గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి అన్నారు. పట్టణంలోని 16వ వార్డులోని కుమ్మరిపాలెంలో శాలివాహనుల ఆత్మీయ సమావేశం సోమవారం రాత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్యే కాసుకు శాలివాహన ప్రజలు ఘనస్వాగతం పలికారు. ముందుగా మల్లమాంబ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ శాలివాహనులను వైఎస్సార్ సీపీ అన్ని విధాలుగా ఆదుకున్నామని పేర్కొన్నారు. శాలివాహనులు సంఘానికి కమ్యూనిటీ హాల్ కావాలని, శాలివాహన చక్రవర్తి విగ్రహం ప్రారంభం సమయంలో తన దృష్టికి తీసుకు వచ్చారని గుర్తు చేశారు. సుమారు రూ.50 లక్షలు విలువైన 25 సెంట్ల స్థలం అందించడం జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో కమ్యూనిటీ భవనం నిర్మాణానికి రూ. 25 లక్షలు అందిస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు తెలిపారు. ప్రతి ఒక్కరూ సీఎంగా వైఎస్ జగన్‌ను, ఇక్కడ తనను, పార్లమెంటు అభ్యర్థిగా అనిల్ కుమార్ యాదవ్‌ను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, పార్టీ పట్టణ కన్వీనర్ చింతా వెంకట రామారావు, వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి, వార్డు కౌన్సిలర్ కత్తెరపు వాసుదేవరెడ్డి, గురజాల నియోజకర్గ యూత్ నాయకుడు గొట్టిముక్కల పవన్‌రెడ్డి, శాలివాహన సంఘం ప్రెసిడెంట్ పొద్దుటూరి గురుప్రసాద్, సెక్రటరీ బడిశ మస్తాన్ రావు, ట్రెజరర్ కానాల వెంకటేష్, మాజీ ప్రెసిడెంట్‌లు మద్దిగుంట్ల సైదులు, ఇల్లూరి వెంకయ్య, కుల పెద్దలు మద్దికుంట్ల రవికుమార్ పలువురు శాలివాహన సంఘం నేతలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిక..

పట్టణంలోని శాలివాహన (శ్రీ వెంకటేశ్వర సాయి కుమ్మర్ల) సంఘం ఆధ్వర్యంలో పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరందరికి ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.



మల్లమాంబ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి



ఎమ్మెల్యే కాసు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన కోనంకి (తండా) గ్రామ టీడీపీ నాయకులు

వైఎస్సార్ సీపీతోనే ఎస్టీల అభివృద్ధి

పిడుగురాళ్ల: ఎస్టీల అభివృద్ధి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సమక్షంలో కోనంకి(తండా) గ్రామానికి చెందిన ఎస్టీ వర్గానికి చెందిన టీడీపీ నాయకులు సుమారు 50 కుటుంబాల వారు కోనంకి గ్రామానికి చెందిన వెకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారందకి వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్టీల అభివృద్ధి కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. గురజాల నియోజక వర్గంలో ఎస్టీ ప్రాంతాలన్నీ అభివృద్ధి పథంలో నడుస్తున్నాయన్నారు. అలాగే రాజకీయంగా వారికి ప్రాధాన్యతను కల్పించామన్నారు. భవిష్యత్‌లో వారి అభివృద్ధి కోసం మరింత కృషి చేస్తామని ఎమ్మెల్యే కాసు తెలిపారు. వైఎస్సార్ సీపీలో చెరిన వారిలో బి.నాగేశ్వరావు నాయక్, బాలాజీ నాయక్, సామ్లా నాయక్, మోహన్ నాయక్, రాము నాయక్, వాల్యా నాయక్, వంశీ నాయక్, రవి నాయక్, నాగనాయక్, దుర్గా నాయక్, గౌరో నాయక్, శ్రీను నాయక్, సాంబ నాయక్, కొండానాయక్, తులసి నాయక్, హనుమంతురావు నాయక్, బాలాజీ నాయక్, నరసింహ నాయక్, నాగ దుర్గానాయక్, పవన్ నాయక్, దుర్గా నాయక్, బాలు నాయక్, అంజి నాయక్, భీక్కు నాయక్, సక్రియా నాయక్‌లతో పాటు మరి కొందరు వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పక్కాగా ఎన్నికల నియమావళి అమలు

నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రమణాకాంత్ రెడ్డి



గురజాల: సార్వత్రిక ఎన్నికల షెడ్యూలు వెలువడిన తరుణంలో నియోజకవర్గంలో ఎన్నికల నియమావళిని పక్కాగా అమలు చేస్తున్నామని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ రమణాకాంత్ రెడ్డి తెలిపారు. మంగళవారం రెవెన్యూ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సంఘం ప్రకటించిన మేరకు మే13వ తేదీన ఎన్నికలు జరగనున్నాయన్నారు. ఎన్నికల షెడ్యూలు ప్రకటించిన నాటి నుంచి ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చినట్లేనన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సహా అన్ని చోట్ల రాజకీయ పార్టీ నేతల ఫొటోలు, బ్యానర్లు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు వారే స్వచ్ఛందంగా తొలగించుకునే విధంగా చర్యలు చేపట్టామన్నారు. వారు తొలగించని పక్షంలో తమ సిబ్బందితో తొలగించడం జరుగుతుందన్నారు.

అనుమతులు తప్పనిసరి....

అధికారుల అనుమతి లేకుండా రాజకీయ పార్టీలు ఎటువంటి కార్యక్రమాలు చేయడానికి వీలులేదన్నారు. రాజకీయ పార్టీలకు సంబంధించి 10 వాహనాలు మించినా, సభలు, సమావేశాలు ఏర్పాటుచేయాలన్నా విధిగా పర్మిషన్ తీసుకోవాలన్నారు. స్పీకర్ బాక్సులు ఏర్పాటు చేయాలన్నా తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి కార్యక్రమాన్ని వీడియో చిత్రీకరణ చేయడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఎన్నికల నియమావళిని అమలు చేసేందుకు ప్రతి మండలానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తహసీల్దార్, ఎంపీడీఓలు ఎన్నికల కోడ్ అమలయ్యేవిధంగా బాధ్యతలు చూస్తున్నారన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు, సామాజిక భవనాలు, దేవాలయాల వద్ద ఎన్నికల ప్రచారం చేయరాదని కోడ్ ఉల్లంఘించినట్లయితే చర్యలు ఉంటాయన్నారు.

304 పోలింగ్ బూత్‌లు ..

నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 304 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గురజాల, దాచేపల్లి, మాచవరం, పిడుగురాళ్ల మండలాల్లో 304 పోలింగ్ బూత్‌లకు గాను 264 బూత్‌ల్లో వీడియో కెమెరాలు అందుబాటులో ఉంచడం జరుగుతుందని 160 బూత్‌లు సమస్యాత్మకంగా గుర్తించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో 2,71,277 ఓటర్లు ఉండగా వారిలో 1,32,131 పురుషులు, 1,39,104 స్త్రీలు, 42 మంది ట్రాన్స్ జెండర్ ఓటర్లు ఉన్నారన్నారు.

కల్వర్టు నిర్మాణంతో ఇక్కట్లకు చెక్



పడిపోయి ప్రమాదభరితంగా ఉన్న కల్వర్టు (నాడు)



నాణ్యతా ప్రమాణాలతో నిర్మితమైన నూతన కల్వర్టు (నేడు)

రెంటచింతల: మండలంలోని మల్లవరం గ్రామంలోకి వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న కల్వర్టు పడిపోయి ప్రమాదం పొంచి ఉండటంతో ఎంతోకాలంగా గ్రామస్తులు అనేక ఇబ్బందులు గురయ్యారు. రాత్రిళ్లు, వాగు పొంగి ప్రవహించే సమయాలలో పడిపోయిన కల్వర్టు కన్పించక పలువురు పాదచారులు, ద్విచక్ర వాహనచోదకులు కిందపడి ప్రమాదానికి గురయ్యారు. ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి దృష్టికి పడిపోయిన కల్వర్టు విషయాన్ని స్థానికులు తీసుకెళ్లారు. స్పందించిన ఆయన నూతన కల్వర్టు నిర్మాణం చేపట్టాలని స్థానిక అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఉపాధిహామీ నిధులు రూ.15 లక్షల వ్యయంతో నూతన కల్వర్టును నిర్మించడంతో గ్రామస్తులు తమ బాధలు తొలిగిపోయాయని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ పర్యటన



తుమ్మకోటలో పర్యటిస్తున్న అధికారులు

రెంటచింతల: మండల పరిధిలోని తుమ్మకోట, పాలువాయి, మల్లవరం, జెట్టిపాలెం, రెంటచింతల, పాలువాయిగేటు, రెంటాల, మంచికల్లు గ్రామాలలో మండల ఎన్నికల నియమ నిబంధనల పర్యవేక్షణ(ఫ్లయింగ్ స్క్వాడ్) అధికారి కె.పాపయ్య నేతృత్వంలోని బృందం మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా పాపయ్య మాట్లాడుతూ మోడ్ ఆఫ్ ఎలక్షన్ కోడ్ కింద నాలుగు రోజులపాటు ఈ బృందం గ్రామాలలో పర్యటించి ఆయా గ్రామాలలో రాజకీయ నాయకుల విగ్రహాలకు పూర్తిగా ముసుగులు వేయించడం, ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలిగించేందుకు, సిమెంట్ బల్లలపై ఉన్న పార్టీలకు సంబంధించిన రంగులను, పేర్లను తెల్ల రంగు పూయించడం వంటి చర్యలను చేపడుతుందన్నారు. ఈ బృందం గ్రామాలకు చెందిన వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చి వారి సహకారంతో ఇళ్లు, ప్రైవేటు ఆస్తులపై, షాపుల గోడలపై ఉన్న రాజకీయ నేతల స్టిక్కర్లు, లోగోలు తొలిగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేవరకు ఈ బృందం మండలంలోని అన్ని గ్రామాలలో పర్యటిస్తూ ఎన్నికల ప్రవర్తనా నియమాళిని పటిష్టంగా అమలు చేయడంలో భాగంగా నగదు, మద్యం, పెద్ద మొత్తంలో బంగారం, వెండి వస్తువులు తరలింపును నియంత్రిస్తుందన్నారు. ఎన్నికల సంఘం నూతనంగా ఏర్పాటు చేసిన సి-విజిల్ యాప్ ద్వారా వచ్చే సమాచారం మేరకు ఈ ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం క్షేత్రస్థాయిలో వేగవంతంగా తనిఖీలు చేయడం జరుగుతుందన్నారు. వీఆర్వో రేఖ ప్రియదర్శిని, కార్యదర్శి ఇస్లావత్ నాగులునాయక్, సచివాలయ సిబ్బంది తదితరులున్నారు.

ఓటరు నమోదుకు చివరి అవకాశం

- ప్రశాంత వాతవరణంలో ఎన్నికల నిర్వహణకు ప్రతిఒక్కరూ సహకరించాలి
- ఈఆర్ఓ వరదా సుబ్బారావు



సమావేశంలో మాట్లాడుతున్న వినుకొండ అసెంబ్లి ఎన్నికల ప్రత్యేక అధికారి వరదా సుబ్బారావు

వినుకొండ టౌన్: ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు మే 13ను ఎన్నికల తేదీగా ఎన్నికల కమిషన్ ప్రకటించిన నేపథ్యంలో, 18 సంవత్సరాలు నిండి ఇప్పటి వరకు ఓటు నమోదు చేసుకోనటువంటి వారు ఏప్రిల్ 15లోపు నూతనంగా ఓట్లు నమోదు చేసుకోవచ్చునని పులిచింతల ప్రాజెక్ట్ డిప్యూటీ కలెక్టర్, వినుకొండ అసెంబ్లీ ఎన్నికల ప్రత్యేక అధికారి వరదా సుబ్బారావు తెలియచేశారు. వినుకొండ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎన్నికల ఏర్పాట్లపై విలేకరులతో సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల తేదీ ప్రకటన వెలువడిన నాటి నుండి కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉందన్నారు. నూతన ఓట్లు చేర్చుకునేందుకు మాత్రమే అవకాశం ఉందని, ఫారం 7, 8లను దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం లేదన్నారు. వ్యక్తులు ఎవరైనా 50 వేల రూపాయలకు మించి కలిగి వున్నా, ఆర్థిక లావాదేవీలు నిర్వహించినా, 10 వేల రూపాయల విలువకు మించి వస్తువులను కలిగి ఉన్నా సదరు అంశాలపై సరియైన పత్రాలతో వివరణ ఇవ్వవలసి ఉంటుందని, ఆధారాలు చూపని యెడల సదరు వ్యక్తులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అధిక మొత్తంలో లావాదేవీలు నిర్వహించిన బ్యాంకు ఖాతాల వివరాలను సైతం ఆదాయ పన్ను శాఖకు తెలియచేయడం జరుగుతుందన్నారు. అమలులో ఉన్న పథకాలు (ఆరోగ్య సురక్ష, ఎన్ఆర్ఈజీఎస్ వంటి పలు పథకాలు) కొనసాగుతాయని, ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల ఖర్చుల వివరాలను పరిశీలించేందుకు ప్రత్యేక అధికారిని నియమించడం జరిగిందని, ప్రచార కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు అనుమతులు తప్పనిసరి అని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు వీలుగా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. అంతేకాకుండా ఎన్నికల సమయంలో ఫిర్యాదులు స్వీకరించేందుకు కంట్రోల్ రూం ఏర్పాటు చేసి, 08646-272000 నెంబరును కేటాయించామని, ఎన్నికలు జరిగే తీరును ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలు గమనిస్తాయన్నారు. ఫిర్యాదు అందుకున్న 100 నిముషములలో సమస్యను పరిష్కరిస్తామన్నారు. అభ్యర్థులు నామినేషన్ల దాఖలుకు ఆన్‌లైన్ (సువిధ యాప్), ఆఫ్‌లైన్ విధానాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వి.ఎస్.టి టీంలు అభ్యర్థులు నిర్వహించే సభలు, సమావేశాలను పర్యవేక్షిస్తాయన్నారు. పట్టణంలోని నిర్మల ఉన్నత పాఠశాలను నియోజకవర్గ పరిధిలో జరిగే ఎన్నికల సామగ్రిని భద్రపరిచి, పంపిణీ చేసేందుకు కేటాయించామన్నారు. సమావేశంలో 5 మండలాల తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్, పట్టణ సీఐ సాంబశివరావు, ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

269 మందికి వైద్య పరీక్షలు

రాజుపాలెం: మండలంలోని బలిజేపల్లిలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. డాక్టర్ రవితేజనాయక్ మాట్లాడుతూ.. శిబిరంలో డాక్టర్ ప్రేమ్‌కుమర్(ఆర్థో), డాక్టర్ విద్య(జనరల్ మెడిసిన్), డాక్టర్ రవితేజనాయక్(జనరల్)లు 269 మందికి వైద్య పరీక్షలు అందించి, మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కంటి వైద్యులు మునీర్ 58 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, కళ్లజోళ్లు అందజేశారు. డాక్టర్ రవితేజ నాయక్ దీర్ఘకాలిక వ్యాధుగ్రస్తుల ఇళ్లకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఏఎన్‌ఎంలు శ్రీకళ, కమల పాల్గొన్నారు.

ముమ్మరంగా కందులు కొనుగోలు

శావల్యాపురం: మండలంలోని అన్నీ రైతుభరోసా కేంద్రంలో కందుల కొనుగోలు ముమ్మరంగా చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి పల్లపోతుల ప్రవీణ్ తెలిపారు. మంగళవారం స్థానిక రైతుభరోసా కేంద్రంలో ఏవో మాట్లాడుతూ మండలంలో అన్నీ గ్రామాల్లో ఖరీఫ్ సీజనులో 1409 ఎకరాలు రైతులు సాగు చేయగా ఒక్కో ఎకరానికి 5 నుంచి 6 క్వింటాల వరకు దిగుబడులు వచ్చాయన్నారు. ఇప్పటి వరకు 110 మెట్రిక్ టన్నులు కందులు కొనుగోలు చేశామన్నారు. నాఫేడ్ క్వింటా మద్దతు ధర రూ.9642 రూపాయలు కొనుగోలు చేస్తున్నామన్నారు. రైతులకు సంబంధించి గోనె సంచులు,కూలీ రవాణా చార్జీలు క్వింటాకు రూ. 74 రూపాయాలకు ప్రభుత్వం భరిస్తుందన్నారు. మార్కెటింగ్ ప్రమాణాలు మేరకు కొనుగోలు పారదర్శకంగా చేస్తున్నట్లు చెప్పారు. కందులు అమ్మిన రైతులకు నాలుగు రోజుల వ్యవధిలో నగదు ప్రభుత్వం జమ చేస్తుందన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణోత్సవం



దుర్గి: రాష్ట్రంలో ప్రసిద్ధి గాంచిన ముటుకూరు తిరునాళ్ల మహోత్సవం ఎన్నికల కోడ్ కారణంగా సందడి లేకుండా ముగిసింది. మంగళవారం వేకువఝాము నుంచి ఆలయ అర్చకులు కొలువై ఉన్న శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి మూలవిరాట్‌కు పూలతో అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని తమ మొక్కులను చెల్లించుకున్నారు. ఈ గ్రామస్తులే ఏటా 15 నుంచి 20 భారీ ఎలక్ట్రికల్ ప్రభలను నిర్మించి తమ భక్తిని చాటుకుంటారు. కోటప్పకొండ తిరునాళ్లలో నిర్మించే భారీ ఎలక్ట్రికల్ ప్రభలకు తగ్గకుండా నిర్మించటం విశేషం. భక్తులకు ఉదయం నుంచి మహాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం స్వామివారి ఊరేగింపు కనులపండువగా జరిగింది. రాత్రి పౌరాణిక నాటకం ప్రదర్శించారు.

కస్తూర్బాలో సీట్ల కోసం దరఖాస్తు చేసుకోండి

దుర్గి: మండల కేంద్రమైన దుర్గిలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం, 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఆకుల ఆశాజ్యోతి తెలిపారు. విద్యార్థినులు ఏప్రిల్ 11లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇంటర్‌మీడియెట్‌లో బైపీసీలో ప్రవేశానికి వీలుందన్నారు. మరిన్ని వివరాలకు పాఠశాలలో సంప్రదించాలన్నారు.

రిటైర్డ్ ఉద్యోగి మృతికి సంతాపం

విజయపురిసౌత్: నాగార్జునకొండ రిటైర్డ్ ఉద్యోగి కె.లక్ష్మమ్మ అనారోగ్యంతో చికిత్స పొందుతూ చెన్నైలో మృతి చెందింది. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక కేంద్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగ సంఘం సభ్యులు లక్ష్మమ్మ మృతిపై సంతాపం వ్యక్తం చేశారు. సంతాపం వ్యక్తం చేసిన వారిలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సభ్యులు షేక్ మస్తాన్‌వలి, బండి నాగేశ్వరావు, అందె ఏసురత్నం, మారావుకుల సుబ్బారావు, పిచ్చయ్య, గంటా వెంకటరెడ్డి, తదితరులు ఉన్నారు.

నేడు వీరాంజనేయస్వామి వార్షిక తిరునాళ్ల



వీరాంజనేయస్వామికి పూజలు

నకరికల్లు: రూపెనగుంట్ల గ్రామంలోని వీరాంజనేయస్వామి ఆలయ 52వ వార్షిక మహోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయాన్ని విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. బుధవారం తిరునాళ్ల మహోత్సవం పురస్కరించుకొని మంగళవారం ఉదయం స్వామివారి నామస్మరణతో ఏకాహం ప్రారంభించారు. అర్చకులు నారాయణం వెంకట కృష్ణమాచార్యులు, రాధాకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. స్వామివారికి అభిషేకాలు చేశారు. ప్రత్యేకంగా అలంకరించారు. భజనా బృందం ఆధ్వర్యంలో జరగిన ఏకాహంలో మహిళలు విశేషంగా పాల్గొన్నారు. పొంగలి పాత్రలు తలపై పెట్టుకొని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. ఆలయంలో స్వామివారి పాదాల వద్ద 16వ శతాబ్దం నాటి శిలాశాసనాన్ని గుర్తించారు. తిరునాళ్లకు వారంరోజుల ముందుగా ఈ నెల 13న ఆలయ వివరాలతో కూడిన శాసనం లభ్యం కావడంతో ప్రాధాన్యం సంతరించుకుంది. శాలివాహన శకం 1512వ సంవత్సరం విక్రతి నామ సంవత్సర బహుళ ఏకాదశి నాడు భరద్వాజ గోత్రానికి చెందిన కొత్తపల్లి రాఘవయ్య కుమారుడు తిమ్మాజీ హనుమంతుడిని ప్రతిష్టించినట్లు.. శాసనంలో ఉన్నట్లు పురావస్తు శాఖ అధికారులు గుర్తించారు. ప్రస్తుత క్యాలెండర్ ప్రకారం క్రీస్తు శకం 1590వ సంవత్సరం ఏప్రిల్ 20వ తేదీగా గుర్తించినట్లు తెలిపారు. ఆలయానికి సంబంధించిన చరిత్ర వెలుగులోకి రావడంతో భక్తుల్లో ఆసక్తి నెలకొంది.

నేడు బెహరావారిపాలెంలో ఆలయ ప్రారంభోత్సవం



రొంపిచర్ల: మండలంలో బెహరావారిపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ కోదండరామ స్వామి వారి ఆలయ విగ్రహ ప్రతిష్ట ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. ఇప్పటికే శిల, ధ్వజ ప్రతిష్ఠంబనకు అవసరమైన యాగ, పూజా కార్య క్రమాలు ప్రారంభమయ్యాయి. బుధవారం వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ నూతన ఆలయ ప్రారంభోత్సవంతో పాటు స్వామి వారి విగ్రహ ప్రతిష్టా మహోత్సవం జరుగుతుందని వారు తెలిపారు. మధ్యాహ్నం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

గోగులపాడులో ఘనంగా తిరునాళ్ల



రొంపిచర్ల: మండలంలో గోగులపాడు గ్రామంలో వేంచేసియున్న సువర్చలా సమేత అభయాంజనేయ స్వామి ఆలయ 30వ వార్షికోత్సవ తిరునాళ్ల వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. అదే విధంగా స్వామి వారిని ప్రత్యేకంగా, అలంకరించి విశేష, సహస్రనామ, పూజలు, అలంకరణ పూజలు నిర్వహించారు. మహిళలు ఆలయ ఆవరణలో పొంగళ్లు చేసి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది. తిరునాళ్ల సందర్భంగా గ్రామంలో రాత్రివేళల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. తిరునాళ్లలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయటం జరిగింది.

దైవభక్తి ఉన్నచోట కుటుంబాలు వృద్ధి

గుంటూరు పీఠాధిపతులు చిన్నాబత్తిన భాగ్యయ్య



అచ్చంపేట: దైవభక్తి, దేవునియందు విశ్వాసం, దేవునియందు నమ్మకం ఉన్న కుటుంబాలు దినదినాభివృద్ధి చెందుతాయని డైసెస్ ఆఫ్ గుంటూరు సొసైటీ పీఠాధిపతులు చిన్నాబత్తిన భాగ్యయ్య అన్నారు. మండలంలోని కోగంటివారిపాలెంలో జన్మించి, జర్మనీకి వలస వెళ్లిన అంచూరి అంతోనిరెడ్డి రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించిన నూతన చర్చిని మంగళవారం బిషప్ భాగ్యయ్య ప్రారంభించారు. బిషప్ మాట్లాడుతూ కుటుంబం గొప్పతనాన్ని వివరించారు. ప్రతి ఒక్కరు దేవునియందు విశ్వాసం ఉంచి పనిచేస్తే సఫలీకృతమవుతుందని చెప్పారు. జర్మనీ నుంచి వచ్చిన భక్తులతోపాటు 25మంది గురువులు, కన్యలు ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఫాదర్ పుట్టి అంతోనిరాజు, ఫాదర్ కిరణ్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.